పెళ్లి షరతులు

"అన్నగారూ, అంత్యనిష్ఠూరంకన్న ఆది నిష్ఠూరం మంచిదెప్పుడూ. పెండ్లిలో మీరు మాకేమేమి జరుపవలసి ఉంటుందో ముందే నిర్ణయం చేసుకుని, ఆ ప్రకారం జరిపేస్తారా, ఆనక ఏ పేచీ ఉండదు. ఏమంటారు?"

అలా బంగారమ్మ అనడంతోనే బ్రహ్మానందం, "వరహా కిమ్మత్తు చేసే మాట చెప్పారండి మీరు. పేచీ అంటే నాకూ గిట్టదు కట్నం కానుకలూ, లాంఛనాలూ ఇవన్నీకూడా మీరేమేమి కోరతారో కోరండి. ఏదో ఓ నిర్ణయాని కొచ్చేసి, ఆ ప్రకారం తూ. చ. తప్పకుండా చేసేస్తాను" అని జవాబిచ్చాడు.

"అట్లయితే వినండి. కట్నం రెండువేయి నూటపదహార్లు."

"అంటే రెండువేల రెండువందల ముప్ఫైరెండు రూపాయలన్న మాట."

"సరిగాచెప్పారు. మరొకరైతే, రెండువేల నూటపదహార్లన్నట్లు అర్థంతీసి రెండో నూటపదహారువద్ద పేచీకి దిగుతారు."

"అందుకేగా నేను అలాంటి అనుమానానికి అవకాశం లేకుండా చేసుకున్నాను...సరే. ఇంక లాంఛనాలు సెలవివ్వండి."

"లాంఛనాలకేమున్నాయ్? పట్టు తాపితాలూ, వెండిచెంబు, వెండి కంచం... వెండి టిఫిన్‌క్యారేజీ ఇలాంటివే."

"తథాస్తు. అలాగే."

"చెంబూ అంటే చిన్నా, పెద్దా ఉంటాయనుకోండి."

"ఎందుకూ, 'ఇన్నితులాల చెంబ'నీ 'ఇన్ని తులాల కంచమ'నీ. అలాగే "ఇన్ని తులాలు పెట్టి క్యారేజీ' అని నిర్ణయం చేసెయ్యండి."

"ఏమైనా మీరుకూడా నాకుమల్లేనే. వ్యవహారంపట్ల చాలా కరకట్టు మనుషులు! నూరుతులాల చెంబూ, నూరుతులాల కంచం, రెండువందల

తులాల క్యారేజీ... రెండువందల రూపాయలకు తక్కువ కాకుండా పట్టుతాపీలు."

"నాకు సమ్మతే. ఇంక ఆడపడుచు లాంఛనాలు తెలపండి."

"వస్తా. మొదట పెళ్లికుమారుడి సరదాలు ముఖ్యం గనుక వాటిని మనవిచేసి ఆ తర్వాత ఆడపడుచు లాంఛనాలు."

"సరే. సెలవివ్వండి."

"మహా ఏమున్నాయిలెండి. ఐదువేళ్లకీ ఉంగరాలనీ, అలక పాన్పు మీద ఓ సైకిలనీ, మనుగుడుపులలో రిస్టువాచీ అనీ, ఆషాడభట్టిలో ఓ రేడియో సెట్టనీ — ఇలాంటివే ఏవో స్వల్పాలు కొన్ని. ఈ కాలంలో పెళ్ళికొడుకులందరూ కోరేవి—ఉన్నాయికదూ? అవి ఎలాంటివి కావాలో పెళ్ళికొడుకే ముందు ముందు తెలియపరుస్తాడు."

"సరే. అతనితో మాట్లాడుతాను."

"ఇంక ఆడపడుచు లాంఛనాలమాట... చూడండి. నాకు ఆడపిల్లలు లేరు. అందుచేత ఆ లాంఛనాలేవో నాకే చెందడం న్యాయం. ఏ సరదా తీరినా ఈ పెళ్లిలోనే కదాండి మరి?"

"కాదండి మరి!"

"ఆడపడుచు లాంఛనాల క్రింద ఒక నూటపదహార్లూ, వియ్యపరాలు లాంఛనాల క్రింద మరొక నూటపదహార్లూ నాకు ముట్టాలి."

"దానికేం? మీకు ముట్టే వాటిలో లోపం చేస్తానా?"

"ఉండండి, నన్ను పూర్తిచెయ్యనియ్యండి—ఇక ఐదు రోజులూ, ఐదు పట్టుచీరలు ఇవ్వడమనీ, ఐదుకాసులు బొట్టుపెట్టడమనీ, తర్వాత వెండి బొట్టు పెట్టెలో వెండి తమలపాకులూ, భమిడిచెక్కలూ పెట్టి ఇవ్వడమనీ, ఇలాంటివన్నీ మామూలుగా ఇప్పుడు అందరూ చేసేదే."

బంగారమ్మ ఇలా ఏకరువు పెడుతోంటే, బ్రహ్మనాదం తనతోకూడా వచ్చిన సుబ్బరామయ్యకేసి తిరిగి, "ఏమోయ్, బావా. అక్కగారు సెలవిచ్చే వాటిలో ఏమైనా మరిచిపోతానో ఏమిటో? నువ్వు కాస్త జ్ఞాపకం పెట్టుకుని, ఇంటికివెళ్ళాక మా ఆడవాళ్ళతో చెప్పాలిసుమా" అన్నాడు.

బంగారమ్మ, "ఆ ఎందుకూ? పోనీ అంత జ్ఞాపకం ఉండదూ అని తోస్తే ఓ చిన్న జాబితాలాంటిది రాయించి ఇస్తాను లెండి. వదినగారికికూడా చూపించడానికి వీలుగా ఉంటుంది" అంది.

"అట్లయితే మరీ మంచిది" అన్నాడు బ్రహ్మానందం.

ఆ సాయంకాలమే తాంబూలాలు ఇచ్చేసి, బ్రహ్మానందం, బంగారమ్మ వ్రాయించి యిచ్చిన జాబితాతోటి, సుబ్బరామయ్యతోటి గంగలకుర్రు తిరిగి వెళ్లిపోయాడు.

ఆయన వెళ్ళాక, బంగారమ్మతో భర్త లక్ష్మీనరసుగారు, "అంతా బాగానే ఉందిగాని, అలా జాబితా రాసివ్వడం ఇదివరకెక్కడా ఎరగం" అన్నాడు ధైర్యంచేసి.

'ఇంతేనా మీ తెలివి!' అన్నట్లుగా ఓ నవ్వునవ్వి, "ఊరికే ఆలోచించకుండా ఇచ్చాననా, జాబితా? అలా వ్రాతమూలకంగా ఉంటే ఆనక వాళ్ళేమైనా చెయ్యకపోయిన పక్షంలో నిలేసి అడగొచ్చు. అంతే గాదు, వాళ్ళు అలా హఠాత్తుగా దిగి, 'మీకేం కావాలో కోరండి' అనేసరికి అన్నీ ఒక్కమాటుగా తోచుకొస్తాయా నాకు మట్టుకు? తర్వాత మెల్లిగా ఆలోచించి, తోచినవన్నీ అందులో చేర్చి మరి ఇచ్చాను."

"ఆషాడపట్టి దగ్గర్నుంచి అడిగేశావుగా! ఇంకా ఏం మిగిలేయి, చేర్చడానికి?"

"ఏం మిగలడమేమిటండోయ్? ఎన్నేనా మిగిలేయి. రాకపోకల ప్రయాణపు ఖర్చులు ఇవ్వడమనీ, మనలో ఆబాల గోపాలానికీ మంచి బట్టలు పెట్టడమనీ, విశాలమైన భవనం విడిదిగా ఇవ్వాలనీ, రెండుమాట్లూ టిఫిన్లనీ, ఏదో ఆషామాషి టిఫినుగాకుండా, రెండు కారాలూ, రెండు తీపులూ, ఏదో ఒక పానీయం గాకుండా, కాఫీ, టీ, కోకో, ఓవల్టిన్, హార్లిక్స్, ఫాలు—ఇలా ఎవరికేం కావలిస్తే అది సప్లయి చెయ్యాలనీ— ఇలాంటివన్నీ మాటల్లో వచ్చాయా మరి?"

"అలైతే ఇవన్నీకూడా నిర్ణయం చేశావన్నమాట!"

"ఏమనుకున్నారు మరి."

పెద్దాపురంనుంచి పెళ్ళివారు తర్లి వచ్చారు. బ్రహ్మానందం జాబితా దగ్గిర పెట్టుకుని ఒక్కటి మరిచిపోకుండా అన్నీ జరుపుతూ వచ్చాడు. కాని బంగారమ్మ మాత్రం ఆడపిల్లవారికి తాము జరపవలసిందేదీకూడా జరిపింది కాదు.

ఆవిడ ఎక్కడికక్కడే మొండిచెయ్యి చూపెడుతోంటే, ఆడపిల్ల వారికి ఆశ్చర్యం వేసింది. ఆడపెళ్లివారికే కాదు, మగపెళ్ళివారితో వచ్చిన

అమ్మలక్కలకే అనిపించింది 'ఇచ్చినదంతా మూటగట్టుకు తెచ్చుకోడం చేతనైనట్లు, పెట్టడం చేతకాదు కామోసు బంగారమ్మకి?' అనుకున్నారు.

బంగారమ్మ పెళ్లికూతురుకు నగలేమీ చేయించి పట్టుకురాలేదు. లక్ష్మీనరసుగారు. "అంత కట్నం పుచ్చుకుంటూ నగలు పెట్టకపోతే నలుగురూ ఏమనుకుంటారో?" అన్నాడు. "కాసు డెబ్భై అమ్మే రోజుల్లో బంగారం కొనడమేమిటండి" ఆవిడ. "పోనీ వారిచ్చిన కట్నంలోదే కొంత తీసి వారి పిల్లకి నగలకింలాగా ఇచ్చేద్దాం" అని చెప్పిచూశాడు.

"అలా ఇస్తే తక్షణం వాళ్ళు బంగారం కొనేస్తారు. అలా ఎందుకు? తర్వాత చేయించవచ్చు లెండి. మునిగిపోయిందేమిటి? ఇంతకూ నగలు పెట్టాలని నిర్ణయం లేదుగా!" తన సొంతంలోంచి తీసి ఇస్తున్నట్లు మాట్లాడిందావిడ.

ఇంక లక్ష్మీనరసు మాట్లాడలేదు. ఆ భర్త సలహా చెప్పవలసినవాడే కాని పెత్తనం ఉన్నవాడు కాదు.

పెళ్ళికూతురు తల్లి జగదాంబకు మాత్రం చాలా కష్టంగా ఉంది. ఇంత కట్నం ఇచ్చి, బోలెడు ఖర్చుచేసి పెళ్ళిచేసుకుంటూంటే తనకి ఏ ముచ్చటా తీర్చని వియ్యపరాలు దొరికిందేమిటని ఆవిడ ఇదయింది. ఆఖరికి బంగారమ్మ పెళ్లికూతురుకు నగలు పెట్టకుండా దాటేస్తోందని తెలిసినప్పుడావిడ ఉండబట్టలేక, తన పినతల్లిని ముందుకు నెట్టింది. ఆ ముసలామె బంగారమ్మతో:

"ఏమండీ పెళ్లికూతురుకు నగలేమీ పెట్టారు కాదేం?" అన్నది.

"ముందు ముందు చేయిస్తాం."

"ముందుముందేమిటి? ఎప్పటి ముచ్చట్లు అప్పుడే మరి."

"అది మా యిష్టం. 'నగలు పెట్టాలి' అన్న నిర్ణయం లేనప్పుడు మీరడగటం సబబు కాదు."

ముసలమ్మకి ఏమనాలో తోచింది కాదు. జగదాంబ అందుకుని, "నిర్ణయించుకోలేదని మానేస్తారుటండి వదినా?" మీకసలే అందరికీ హాస్పిటల్స్ దగ్గిరనుంచి నిర్ణయించుకోడం చేతనవుతుందా?" అని సాగదీసింది.

బంగారమ్మ "చేతగాకపోతే ఊరుకోవలసిందే మరి! ఏమండీ. అన్నగారూ మాట్లాడరేం?"

బ్రహ్మానందం, "మీరు చెప్పింది చాలా సబబుగా ఉంది. నేనిలాంటి వేవీ మీతో నిర్ణయించుకోలేను. అంచేత మావాళ్ళు చేసిన యీ ప్రసంగమంతా అప్రస్తుతమని నేను వప్పుకుంటున్నాను" అని చెప్పి, బ్రాహ్మలతో "బాబూ, ముందు కార్యక్రమం జరిపించెయ్యండి" అన్నాడు.

జగదాంబ పెరటి వసారాలోకొచ్చి నిలబడి, బొటబొట కారే కన్నీటితో బొటనవ్రేలు తడిసింది. బ్రహ్మానందం "ఏముటే ఇది?" అని మందలించాడు.

"నలుగురిలోనూ దాన్ని చిన్నబుచ్చి, పైగా ఏమిటే ఇది అంటా వేమిటి?" అన్నాడు బావమరిది సుబ్బరామయ్య. అత్తగారు, "చాల్లే వోయ్, మొహంమీద ఉమ్మేసి అడక్క, "మాదే తప్పని మా నోళ్ళు నొక్కావ్!" అంది. బ్రహ్మానందం నవ్వుతో, "మనకిలా పాయింటు లేనప్పుడు ప్రీవీకౌన్సిల్ దాకా వెళ్ళి ఏం ప్రయోజనం?" అనేసి, "కూరల్లో పోపులు వేయమనండి. భోజనాలకి ఊళ్ళోకి పిలుపులు పంపుతాను" అన్నాడు.

పెళ్ళి అయి విడిదిలోకి వెళ్ళాక మగపెళ్ళివారు రెండు రకాలుగా చెప్పుకున్నారు. బంగారమ్మ పక్షంవాళ్ళు, "మంచి బాగా నోరు నొక్కింది ఏదో. మహా తెలివిగా అడుగుతున్నాం అనుకున్నారు వాళ్ళు" అని ఆమెను మెచ్చుకున్నారు. కాని తక్కినవాళ్ళు. "ఏదో బుకాయించగా సరా? మన ఎదురుగుండా అనుకోకపోయినా ఊళ్ళోవాళ్ళంతా 'పుచ్చుకోవడం పూర్వాంన్నుంచీ ఉండి పెట్టడం పెద్దలనాడే లేదుగామోసు వీరిక'ని మన వెనకాల మెటికలు విరుస్తున్నారు. ఇంతకూ ఆయన ధర్మాత్ముడు. వియ్యపరాలి పక్షమే చెప్పాను." అన్నారు.

ఇలా అనుకుంటూంటే విడిదిలో గడియారం ఇట్టే కొట్టేసింది ఒంటిగంట. 'ఇదేమి చెప్మా ఒంటిగంట ఐనా భోజనాలకి కబురు వచ్చింది కాదు?' అనుకున్నారు వాళ్లు. 'భోజనాలు ప్రొద్దెక్కకూడద'ని కూడా ఓ షరతు పెడితే బాగుండి పోననుకున్నాడు బంగారమ్మ తమ్ముడు. 'ఇలా ఆలస్యం చేసినందుకు ఈ రోజు భోజనాలువద్ద వడ్డన సమయంలో ఆడపెళ్ళివాళ్ళని అడ్డమైన గడ్డీ కరిపించి, ఏడిపించాలన్నాడో నక్షత్రకుడు. 'ఎందుకూ నాకు వదిలెయ్యండి. ఇట్టే అభాసుచేసి వదిలిపెడతాను'అన్నాడు మరో ఆకతాయి.

వాళ్ళలా ప్లాను వేస్తోంటే గడియారం రెండు కొట్టేసింది. ప్రొద్దున్ననగా తిన్న ఉప్మా వగైరాలు ఎప్పుడో అరిగిపోయి వారికి ఆకలి ఎక్కువైంది. బ్రహ్మానందంగాని, జగదాంబగాని, సుబ్బరామయ్యగాని ఆ వైపు నుంచి వస్తున్నారేమోనని విడిది అరుగుమీద నిలబడి చూడడం మొదలెట్టారు. బంగారమ్మ తల్లికి శోష వచ్చేట్లయింది. పిల్లలేడవడం మొదలెట్టారు. 'ఎవరైనా వెళ్ళి సంగతేమిటో కనుక్కొస్తే బాగుండునం'దో తల్లి. మరో ఆలోచన తోచక 'కానివ్వండి' అంది బంగారమ్మ. నక్షత్రకుడు బయల్దేరి వెళ్ళాడు. వెళ్ళిన ఐదు నిముషాల్లోనే పెద్దపులి ఎదురైన వాడికిమల్లే వెనక్కి పరుగెత్తుకొచ్చాడు.

"ఏమిరా?"

"ఏముందీ, పెళ్ళివారింట భోజనాలై చేతులు కడుక్కుంటున్నారు."

"నిజంగా?"

"అబద్ధమెందుకు చెప్తాను? అరుగో చూడండి. భోజనం చేసిన వాళ్ళలో కొందరు ఇటే వస్తున్నారు."

అతగాడు చెప్పినమాట నిజమే అన్నట్లు పెళ్ళివారింటినుంచి విడిదికేసి కొందరు బ్రాహ్మణులు బొజ్జలు సవరించుకుంటూ, "ఎలాగైనా, బ్రహ్మానందంగారు కక్కుర్తిలేని మనిషయ్యా. బూరెలుకూడా నేతితో చేయించాడు!" అని మెచ్చుకుంటూ, విడిదిగుమ్మం ముందునుంచే పోతున్నారు. బంగారమ్మ అగ్గిమీద గుగ్గిలమై "మాశారా ఎంతపని చేశారో? మమ్మల్ని భోజనానికి పిలవకుండా ఇలా ఊళ్ళో అందరికీ పెడతారా? మమ్మల్ని అవమానం చేస్తారా?" అంటూ కేకలేస్తూ కాళికామ్మవారికి మల్లే చిందులు తొక్కడం మొదలెట్టింది. దారినిపోయే బ్రాహ్మణులలా నిలబడిపోయారు. చోద్యం చూద్దామని చుట్టుప్రక్కల జనమంతా పోగయ్యారు.

మరికాస్సేపటికి పెండ్లివారింటి దగ్గర్నుంచి, ఒక కావిడిలో రెండు తీపులూ, మరొక కావిడిలో రెండు కారాలూ, వేరొక కావిడిలో కాఫీ, టీ, వగైరాలూ పట్టించుకుని సుబ్బరామయ్య విడిదికి వచ్చాడు. ఆ వెనకాలే బ్రహ్మానందం గోల్డుఫ్లేక్ సిగరెట్టులూ, ఆడుకునేందుకు పేకలూ పట్టించుకుని వచ్చాడు.

"భోజనం పెట్టకుండా, ఇవన్నీ ఎందుకు?" అని అడిగేశాడు బంగారమ్మ తమ్ముడు.

"ఏం ఇంకా భోజనం కాలేదా?" అన్నాడు బ్రహ్మానందం.

బంగారమ్మ తోకతొక్కిన తాచులా లేచి, వీధుల్లో పోయినవాళ్ళతో "చూశారా ఆయన మాటలు? మమ్మల్ని భోజనాలకి పిలవకుండా, 'భోజనం కాలేదా?' అని అడుగుతున్నాడు?" అంది.

అందరిలోనూ నిలబడి చూస్తోన్న రెవిన్యూ ఇన్స్పెక్టరుగారు, 'ఏమిటి బ్రహ్మానందంగారూ, పెళ్ళివారికి భోజనం పెట్టకపోవడమేమిటి? మేమింకా వారు వేరే ఇంకో పందిట్లో ఉన్నారనుకున్నాం' అన్నాడు.
బ్రహ్మానందం మెల్లిగా జేబులోంచి ఓ కాగితం తీసి, "బాబూ, ఇన్స్పెక్టరుగారూ, ఈ జాబితా చిత్తగించండి." అంటూ ఆయనకు అందిచ్చాడు. "వారికి మేం చెయ్యవలసినవన్నీ నిర్ణయించుకుని మా వియ్యపరాలు ఆ జాబితాలో రాయించి యిచ్చారు. ఆ ప్రకారం జరుపుకుంటూ వచ్చాను. పెళ్లి అయాక జరపవలసింది మధ్యాహ్నం మూడుగంటలకి టిఫిను ఇదిగో పంపించాను. సిగరెట్లూ, పేకలూ కూడా ఇవుగో నిర్ణయప్రకారం తెచ్చాను. భోజనం వారు నిర్ణయం చెయ్యలేదు. మీరే చూడండి. నిర్ణయం చేసినవన్నీ సుమారు నూట ఇరవైమూడు ఐటెములు వరకూ జాబితాలో ఉన్నాయి. ఇవన్నీ చేస్తున్నాను, చేస్తాను. కాని నిర్ణయంలేని వాటిలో నన్ను ఇలా నిఖా చెయ్యడం సబబా?... ఏమండీ, బావగారూ, తమరే సెలవియ్యండి." అని ఊరుకున్నాడు.

పరధ్యానంగా వింటూంటే ద్వారబంధం తలకు పెడీలుమని తగిలి నసాలం అంటినట్టయింది బంగారమ్మకి. లక్ష్మీనరుసు, "బావగారూ, నిర్ణయించుకోలేదని మేము నగలు ఎగగొట్టినందుకు మాకు ఇలా బాగా బుద్ధి చెప్పారు! పిల్లలు ఆకలితో నకనకలాడుతున్నారు. మీకు పుణ్యముంటుంది, ఇంక భోజన ప్రయత్నం చేయించండి' అన్నాడు,

"అంతా సిద్ధంగావుంది. మడిగట్టుకు దయచెయ్యండి" అని చెప్పి బ్రహ్మానందం సుబ్బరామయ్యను తీసుకుని వెళ్లిపోయాడు.